తప్పు చేసిందొకరయితే, దాని ఫలితం అనుభవించేది మరొకరా?

ఆ రోజు ఆసుపత్రిలో డాక్టర్ జరీనాకు ఆపరేషన్స్ డే. పొద్దుపోయింది. ఇంటికొచ్చేసరికి మూడ యింది. బాగా అలిసిపోయింది. స్నానంచేసి, భోంచేసి, పడుకుంటే సాయంత్రం అయిదు న్నరకి గాని మెలుకువ రాలేదు.

బద్ధకంగా లేచి, మొహం కడుక్కుని వచ్చి డ్రాయింగ్ రూంలో కూచుంది. టీ పాట్ తెచ్చి పెట్టాడు నౌకరు కుర్రాడు. ఒక కప్పు టీ కలుపు కుని, మెల్లి మెల్లిగా సిప్ చేస్తూ, కొడుకు బాబ్లూ (మాజిద్) గురించి అడి గింది. కాలేజీనించి వచ్చేసి టీ తాగి, టెన్నిస్ ఆటటానికి వెళ్ళాడని చెప్పాడు.

ఇంతలో కాల్ బెల్ మ్రోగింది. నౌకరు వెళ్ళి కనుక్కుని వచ్చాడు. ఎవరో ఒక అమ్మాయి తనని చూడడానికి వచ్చిందట. లోపలికి రమ్మన్నది.

ఆ అమ్మాయి గదిలో అడుగు పెట్టింది. ముదురాకుపచ్చ పైజమా మీద, అదే రంగు మాక్సీలాంటి కమీజూ, దుపట్టా వేసుకుంది. అదే రంగు ఎత్తు మడమల శాండిల్స్ తొడుక్కుంది. భుజాలవరకూ కత్తిరించిన నల్లని కురులు. తెల్లని కోల మొహం, తీర్చిదిద్దిన కనుబొమలు. పెదా లకు ఎరుపురంగు. చెవులకు రింగులు. చేతిలో ఒక పచ్చని వానిటీ బ్యాగ్; బాగా కలవారి పిల్లలాగే వుంది.

రాగానే "ఆదాబ్ మేడం" అంటూ కుడిచేతి వేళ్ళని నొసటిదాకా తీసికెళ్ళింది.

జరీనా కూడా సలాంచేసి "రా మ్మా ఇలా కూచో" అన్నది.

కూచుంది.

"ఏమ్మా! ఎవరు నువ్వు"

"నా పేరు నఫీసా. ఇంజనీరింగ్ కాలేజీలో బి. ఇ. చదువుతున్నాను."

"ఓహో.. అయితే మాజిద్ కోసం...?"

"కాదండీ మీ కోసమే వచ్చాను.... సంప్రతించాలి."

"....చూడమ్మా. నీకు తెలీదేమో. నేను యింట్లో ప్రాక్టీసు పెట్టలేము. హాస్పి టల్లోనే...."

"నేను వైద్య సలహాకోసం రాలేదు మేడం, మరో విషయంలో సంప్రతించా లని వచ్చాను."

"మరో విషయంలోనా!" చిన్నగా నవ్వింది జరీనా. "నేను లాయర్నిగానీ, సోషల్ వర్కర్నిగానీ కానే!"

"కారు. కాని ఆ విషయం మీకూ కూడా సంబంధించిందే."

"నాకా!" ఆశ్చర్యపోయింది జరీనా.

"అయితే చెప్పు.... ఆఁ వుండు. ముందు టీ తాగు"

"వొద్దొద్దు. నేను టీలూ, కాఫీలూ తాగను"

"మంచిదే, పోనీ కూల్ డ్రింక్ తెప్పించనా?"

"ఉహుఁ, నేనేం తాగను. మీ ఆదరణ చాలు."

"మాటకారి పిల్లే" అనుకుంది జరీనా.



# విధివంచితులు

## నెల్లూరి కేశవస్వామి

**అంబడిపూడి**
**సెక్సు విజ్ఞాన ప్రచురణలు**

ప్రపంచంలో వున్న ఏకైక సెక్స్ లేబరేటరీ నిర్వహించిన డాక్టర్స్ మాస్టర్స్ జాన్సన్ సెక్సాలజి ఎడిటర్ లెమన్‌క్లార్కు డాక్టర్ రాబర్ట్ చార్ట్‌హాం పరిశోధనల ఆధారంగా దంపతులు ఆనందంగా తృప్తిగా జీవించడానికి వివాహ జీవితం విజయవంతమై ఆరోగ్యకర సంతానానికి ప్రతి స్త్రీ పురుషుని దృష్టిలో పెట్టుకొని రూపొందించబడిన పుస్తకాలు. తెలుగులో

1. గుప్త జ్ఞానం. వెల రూ. 10/-
2. 1001 సిగ్గుపడే ప్రశ్నలు. వెల రూ. 10/-
3. సెక్స్ విజ్ఞానం వెల రూ. 10/-
4. గర్భమూ-గర్భనిరోధం 5/-
5. సెక్సులోపాలు-సర్దుబాట్లు 6/-
6. ఉద్రిక్తస్థానాలు-తృప్తికి మార్గాలు 6/-
7. కేళీ విలాసం 5/-

మిత్రులతో చెప్పుకోలేక డాక్టర్‌తో చెప్పడానికి సిగ్గుపడి లోలోన కుంగిపోతున్న యువతీ యువకుల సందేహాలు సమాధానాల రూపంలో సెక్స్ విజ్ఞానం. నిరాశ. నిస్పృహ ఆత్మహత్యలు నివారించి సంతోషంగా జీవించగల మార్గాలు ప్రపంచమున్ని భాషల్లో అనువదింపబడిన పురాతన హిందూ సెక్స్ ప్రామాణిక గ్రంధం. మహర్షి

8. వాత్స్యాయన కామశాస్త్రం. 5/-

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జీ.డి. ఖోస్లా పుస్తకం ఇన్స్పిరేషన్‌తో వ్రాయబడింది స్త్రీ మానసిక పరిశోధకురాలు డాక్టర్ సైమన్‌బిడి వోవర్ ఆధారంగా హిందూ శాస్త్రాల ఆధారంగా

9. స్త్రీలనాకర్షించడమెలా 4/-
10. పురుషులనాకర్షించడమెలా 10/-
11. ఆడది కోరేదేమిటి 4/-

రూపాయలు ఎంతైనా ముందుగా మనిఆర్డరు ద్వారా పంపిన వారికి రిజిస్టర్డు పోస్టులో పంపబడును వి.పి.పి. పద్ధతిలేదు.

**జలజ ప్రచురణలు** విజయవాడ-3


"ఊఁ. చెప్పు. ఏఁవిటో."

కొద్ది క్షణాలు మౌనంగా వుండి ఆ అమ్మాయి అన్నది. "నేను.... నేను మీ ఇంటి కోడలుగా రాగలచుకున్నాను. మీకు అభ్యంతరమా?"

జరీనా నిర్ఘాంతపోయింది.. "ఏఁవిటో, నువ్వేమంటున్నావో నాకు అర్థం కావటం లేదు."

"నేను సూటిగానే చెప్పానే? నేను మీకు కోడల్ని కాగలచుకున్నాను."

"అంటే....అంటే. మా అబ్బాయి బాబ్లూ...."

"బాబ్లూ కాదు. మాజిద్."

"ఇద్దరూ ఒక్కరేలే....అతణ్ణి... ?"

"నేను ప్రేమించాను. పెళ్ళి చేసుకోదలచాను."

ఎంత ధైర్యం ఈ పిల్లకు!

"మరి ... మరి మావాడు కూడా ...."

"ప్రేమించాడు. ఇద్దరం ప్రేమించుకున్నాం. అందుకే పెళ్ళి."

"కాని.... కాని నాకు తెలీదే?"

"అదే అనుకున్నాను నేనుకూడా! మీ అబ్బాయికి ప్రేమించే సాహసం వుంది కాని. చెప్పుకునే ధైర్యంలేదు. అందుకే నేను వచ్చాను."

"నీ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నాను. కాని మా వాడిని కూడా కనుక్కోవాలిగా!"

"కనుక్కునే సమయం మించిపోయింది మేడం!"

"అంటే?"

"నేను.... నేను మీ మనవడికి తల్లిని కాబోతున్నాను."

"నఫీసా!!" వణికిపోయింది జరీనా. "కాదు-కాదు. అది నిజం కాదు...."

"అక్షరాలా నిజం మేడం" ప్రశాంతంగా జవాబు చెప్పింది నఫీసా. "నాకు పీరియడ్స్ కావటంలేదు. చెకప్ కూడా చేయించుకున్నాను. మూడో నెల నడుస్తోంది."

జరీనా నోట మాట రాలేదు. కొంచెం సేపు అలాగే చూస్తూ కూచుంది. "పద నేనూ చూస్తాను" అంటూ లేచింది.

"సరే పదండి" నిర్భయంగా లేచి నిల్చుంది నఫీసా.

ఇద్దరూ ప్రక్క గదిలోకి వెళ్ళారు. నఫీసాను బల్లమీద పడుకోబెట్టి పరీక్ష చేసింది. నిజమేనని తేలింది. ఒక నిట్టూర్పు విడిచి. బేసిన్‌లో చేతులు కడుక్కుని వచ్చి కూచుంది జరీనా. వెనకాలే నఫీసా వచ్చి కూచుంది.

"నేను చెప్పింది అబద్ధం కాదుకదా మేడం?"

".... కాదు .... కాని ... "

"కాని, దీనికి బాధ్యుడు మా అబ్బాయేనని రుజువేమిటంటారు.... అంతేనా మేడం?"

".... .... ...."

"ఆ విషయం మీ అబ్బాయినే అడగండి. అతని అంతరాత్మే నిజం చెప్తుంది... ఒకవేళ. అతను నీచానికి దిగజారి నిజం ఒప్పుకోకపోతే నేను రుజువులూ. సాక్ష్యాలూ తేను. కోర్టుకెక్కను. ఇంత విషంతాగి చచ్చిపోతాను."

"నఫీసా!"

"అవును మేడం! నేను కృతనిశ్చయంతోనే చెబుతున్నాను. నా ఈ బాగ్‌లో విషం సీసా రెడీగానే వుంది. కాని. ఒక్క విషయం మేడం! నేను చస్తే ఒంటరిగా చావను. ఇందులో గుళ్ళతో నిండిన పిస్తోలుకూడా వుంది. నా పతనానికి కారకులైనవారిని చంపి మరీ చస్తాను."

"నఫీసా! నఫీసా!" జరీనా గాభరాపడిపోయింది.

"ఏఁవిటా వాగుడు? నీకు పిచ్చిపట్టినట్టుగా వుంది."

"లేదు మేడం! నాకు పిచ్చిపట్టలేదు." మొట్టమొదటిసారిగా నఫీసా కంఠం జీరపోయింది. పెదవులు వణికాయి. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "నాకు పిచ్చిపట్టలేదు మేడం! యదార్థమే చెబుతున్నాను. నా పరిస్థితిలో మీరేగనక వుంటే ..."

"స్టాపిట్ నఫీసా: స్టాపిట్ ప్లీజ్!" జరీనా పెద్దగా అరిచింది.... ఆ పిల్లకేం తెలుసు, తానూ ఒకనాడు అలాంటి చిక్కులోనే ఇరుక్కుందని?....

జరీనా కాస్త తమాయించుకుంది. మెల్లిగా అన్నది. "చూడు నఫీసా! నా మనసిప్పుడేంబాగోలేదు. రేపుసాయంత్రం రా. మాట్లాడుకుందాం.... వెళ్ళు."

"సరే మేడం! అలాగే కానివ్వండి... వస్తాను" అంటూ లేచి వెళ్ళిపోయింది నఫీసా

"ఆఁ. ఆగు నఫీసా! ఒక్క మాట.... నువ్వసలు ఎవరి కూతురివో. చెప్పనేలేదు."

"మా నాన్న పేరు సయ్యద్ నస్రుతుల్లా"

జరీనా ఉలిక్కిపడ్డది! "ఏమన్నావ్? నస్రుతుల్లా? ఏ నస్రుతుల్లా?"

"సెషన్స్ జడ్జ్ నస్రుతుల్లా."

"యా అల్లా!" జరీనాకు ఒక్కసారి వొళ్ళంతా చెమటలు క్రమ్మాయి. అయోమయంగా నఫీసాను చూస్తూ తనలో తానే అనుకుంటున్నట్టు "కాదు. కాదు. నిజం కాదు...." అంటోంది.

"ఏఁవిటి మేడం! ఏమైంది? మీరు మా నాన్నను యెఱుగుదురా?"

"లేదు లేదు. నేనెరగను.... వెళ్ళు

వెళ్ళు నువ్వెళ్ళిపో! రేపురా" అంటూ గబగబా పడగ్గదిలోకి పరుగు తీసింది. మంచంమీద బోర్లాపడి భోరున ఏడ్చేసింది జరీనా .... చాలా సేపు అలాగే వుండి పోయింది.

"మమ్మీ ! ... మమ్మీ !" అన్న కొడుకు పిలుపు వినిపించి దిగ్గున లేచి కళ్ళు తుడుచుకుని కూచుంది జరీనా.

"మమ్మీ ! నువ్విక్కడున్నావా ? నేను ఇల్లంతా వెతికాను.... అదేమిటి మమ్మీ! అలా వున్నావు ! ఏమైంది ?"

"ఏం కాలేదు.. నీ ఆట ఎలాసాగింది ?"

"ఓ. వండర్ ఫుల్ ! గెలిచాను. నేను అందరిమీదా గెలిచాను మమ్మీ ! నన్ను సెలెక్ట్ చేసుకున్నారు."

"దేనికి ?"

"యూనివర్సిటీ టీమ్కి. ఎల్లుండినించి గుంటూరులో ఆంధ్రాతో మూడు రోజుల మాచ్ లున్నాయి. నన్నూ రమ్మని బలవంతం చేస్తున్నారు. మమ్మీని అడిగి చెబుతానన్నాను. వెళ్ళనీ మమ్మీ! ప్లీజ్ మమ్మీ "

"సరే అలాగే వెళ్దువుగానిలే."

"ఓ గ్రేట్ ! మా మమ్మీ గ్రేట్ !" అంటూ కావిలించుకున్నాడు

చేతులు విడిపించుకుని జరీనా నిశితంగా కొడుకుని చూస్తూ కూచుంది

"అదేమిటి మమ్మీ ! నన్నలా చూస్తావేం ?"

"ఎంత ఎదిగిపోయావో చూస్తున్నాను"

"నేనా ?....ఎదిగిపోయానా ?"

"అవును. నా వూహలకు అందనంత ఎదిగిపోయావు."

"ఏమిటో మమ్మీ ! నీ మాటలు నాకు అర్థం కావటం లేదు. నువ్వు రోజూ నన్ను చూస్తూనే వున్నావుగా ?"

"చూస్తున్నాను. కాని ఇవ్వాళే తెలుసుకున్నాను."

"ఏమని ?"

"నువ్వు ప్రేమకలాపాలదాకా ఎదిగిపోయావని."

మాజిద్ గతుక్కుమన్నాడు. "నేనా ? ప్రేమకలాపాలా ?"

"మాడు బాబూ ! నువ్వు నాతో యెన్నడూ అబద్ధాలాడననివాగ్దానంచేశావు. ఇంతవరకు ఆడలేదనే అనుకున్నాను."

"ఇప్పుడెందుకు అనుమానం వచ్చింది మమ్మీ !"

"మరి నఫీసా సంగతి యెందుకు దాచావు ?"

మాజిద్ కలవరపడిపోయాడు. "నఫీసా ?.... నఫీసా సంగతి నీకెట్లా తెలుసు మమ్మీ ?"

"నాక్కాదు. నీకు తెలుసు.... నీ స్నేహితురాలు.... ప్రేయసి."

"మమ్మీ !"

"ఏం. అది నిజంకాదా !" ఆశగా అడిగింది.

మాజిద్ మాట్లాడకుండా తల దించేసుకున్నాడు.

"ఓ ! అయితే, నిజమేనన్నమాట.... మరి నాతో ఎందుకు చెప్పలేదు!"

"భయపడ్డాను."

"భయమా? భయం దేనికి?"

"వాళ్ళు ధనవంతులు. గొప్పింటివాళ్లు. పూర్వం వాళ్ళది నవాబీ కుటుంబమట ధనవంతులన్నా, నవాబులన్నా నీకెందుకో ఏవగింపు.... అందుకే భయపడ్డాను."

"ఒహో! నా అభిప్రాయాలు తెలిసి కూడా ఒక గొప్పింటి అమ్మాయితో ప్రేమ కలాపాలు జరపటానికి వెనుకీయలేదు. కాని నాతో చెప్పటానికే భయపడ్డావా?"

మాజిద్ మౌనంగా వుండిపోయాడు.

"గుంటూరు కెప్పుడెల్తున్నావు ?"

తల్లి హఠాత్తుగా విషయం మార్చటం మాజిద్కు ఆశ్చర్యాన్ని కలిగించింది. "రేపు" అన్నాడు.

"తిరిగి రాక ఎప్పుడు ?"

"మూడు రోజుల తర్వాత."

జరీనా మనసు కాస్త తేలికపడ్డట్టనిపించింది.

"రేపు ఎప్పుడెల్తున్నారు ?"

"మధ్యాహ్నం ట్రేనుకు."

"ఈలోగా నువ్వు నఫీసాను కలుసుకోటానికి ప్రయత్నం చెయ్యొద్దు. తెలిసిందా? కలుసుకోనని మాటివ్వు!" కాస్త కఠినంగానే అన్నది.

మాజిద్ భయంభయంగానే తల్లిని చూస్తూ "సరే మమ్మీ !....కలుసుకోను" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా జాగరణే చేసింది జరీనా. పీడకలలా మరిచిపోయిన దుర్ఘటన స్మృతిపథాన పునరావృతమై పీడించి పిప్పి చేసింది.

రెండో రోజు ఆసుపత్రికి శలవుచీటీ పంపింది జరీనా. కొడుకు వెనువెంటనే వుండి అన్నీ సర్ది పెట్టింది. స్టేషన్కెళ్ళి రైలు యెక్కించి గుంటూరునించి తిరిగి వచ్చే ముందు ఫోన్ చెయ్యమని మరీ మరీ చెప్పి వచ్చింది.

ఆ సాయంత్రం ఆరింటికి వచ్చింది నఫీసా నిన్నటి డ్రెస్సే వేసుకుంది. కాని రంగు వేరు. అంతా గులాబీరంగు.

రాగానే ఆదాబ్ చేసింది. జరీనా సలాం అందుకుని కూచోమని చెప్పింది.

ఇద్దరూ కొంత సేపు మౌనంగానే కూచున్నారు. ఆఖరికి నఫీసానే ఎత్తింది మాట, "ఏం మేడం ! ఏమన్నాడు మీ అబ్బాయి ?"


"ఏమంటాడు ?.. వాడు నీచుడు కాడు."

"అంటే ఒప్పుకున్నట్టేగా ?" సంతోషంగా అడిగింది నఫీసా.

"ఆ ఒప్పుకున్నట్టే.... కాని మేము ఒప్పుకున్నంత మాత్రాన ఏమవుతుంది? మీ వాళ్ళు కూడా ఒప్పుకోవాలిగా ?.... ముఖ్యంగా మీ నాన్న ?" 'నాన్న' అన్న పదాన్ని నొక్కి పలుకుతూ అన్నది జరీనా.

"ఒక్కటి చెప్పండి మేడం ! మా నాన్నను మీరు ఎరుగుదురా ? నిన్న కూడా మా నాన్న పేరెత్తగానే మీ ముఖకవళికలు మారాయి."

"ఎరుగను. కాని ఆయన్ను గురించి విన్నాను."



జెఠ్రలు

"ఏం విన్నారు?"

"చెబితే నీకు బాధ కలుగుతుందేమో?"

"ఫరవాలేదు చెప్పండి."

"చాలా కఠినాత్ముడు."

"కావచ్చు. కాని నా విషయంలో కాదు. నేను ఒక్కర్తినే కూతుర్ని. నేనంటే పంచప్రాణాలు నా అన్ని అపరాధాలూ మన్నిస్తారన్న నమ్మకం నాకుంది."

"అయితే ఆయన్నే పిలుచుకురా మాట్లాడ్డానికి."

"మేడం దయచేసి మీరు రాకూడదూ?"

"ఊహుఁ నేను రాలేను... మీ ప్రేమ కలాపాలు ఎంత దూరం వెళ్ళాయో అంతా చెప్పేస్తే, ఆయనే పరుగెత్తుకుంటూ వస్తారు"

"సరే, అయితే ఎప్పుడు రమ్మంటావు? రేపు రామా?"

"రండి"

"థాంక్స్ మేడం!....మీ ఉదారత్వానికి నేను ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలీటంలేదు" అంటూ చేతులు పట్టుకుంది నఫీసా

"దట్సాల్‌రైట్ మై ఛైల్డ్" అన్నది జరీనా ఉబుక్కొస్తూన్న కన్నీళ్ళని ఆపుకుంటూ.

మరుసటి రోజు వచ్చారు సయ్యద్ నస్రుతుల్లా, ఆయన భార్యా, కూతురు. ఫుల్ సూట్‌లో వున్నాడు. తల వెంట్రుకలు సగం తెల్లబడ్డాయి. అందంతోబాటు హుందాతనం కూడా ముఖంలో పేరుకుంది. బేగం నస్రుతుల్లా నఫీసాకు పాత మోడల్‌లాగుంది. తల్లీ కూతుళ్ళు ఒకే రంగు చీరలూ, బ్లౌజులూ ధరించారు ముగ్గురి మొహాలూ కళావిహీనంగా వున్నాయి.

ప్రథమ పరిచయాలు కాగానే, నౌకరు టీ, బిస్కట్లు పట్టుకొచ్చాడు. నఫీసాకు కూల్‌డ్రింక్ తెప్పించింది జరీనా.

వచ్చినప్పట్నించీ నస్రుతుల్లా జరీనాను అనుమానంగా, అశాంతిగా చూస్తున్నాడు. ఒక్క మాటా మాట్లాడలేదు. అంతా భార్యే మాట్లాడుతోంది.


"మీ అబ్బాయి ఇంట్లో లేడా!" బేగం నస్రుత్ అడిగింది

"లేడు. టెన్నిస్ మ్యాచ్ కని పైవూరు వెళ్ళాడు."

"నఫీసా బేటీ! నువ్వు కాస్త వరండాలోకెళ్ళి కూచో, మేము మాట్లాడుకోవాలి" అన్నది తల్లి.

నఫీసా మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

"చూశారా డాక్టర్ గారూ!" మళ్ళీ అందుకుంది బేగం నస్రుత్. "మన పిల్లలు యెంతపని చేశారో....!"




"అవును. తప్పే చేశారు. కాని ఆ వయసే అలాంటిది. పొరపాట్లు జరుగుతాయి. కాని కొందరు కఠినాత్ములు దానికి వారిని శిలువ వేసేస్తారు" అంటూ క్రీగంట నస్రుతుల్లాను చూసింది జరీనా.

అతను ఉలిక్కిపడ్డట్టు చూసి, తల తిప్పేసుకున్నాడు.

"మీరు మంచివారు కాబట్టి సరిపోయింది లేకపోతే ఏమయ్యేదో" వాపోయింది బేగం నస్రుత్.

"ఏమయ్యేది? ఒక అమాయకురాలి జీవితం నాశనమయ్యేది."

"నాన్‌సెన్స్!"- ఒక్కసారి అరిచాడు నస్రుతుల్లా "నేను ఊరుకుండేవాణ్ణికాను. ఆ కుర్రాణ్ణి కోర్టుకీడ్చి మరీ పెళ్ళి చేయించేవాణ్ణి."

"ఓహో! అయితే అలాగే కానివ్వండి. మరి నా దగ్గరకు ఎందుకు రావటం?" నిదానంగానే అన్నది జరీనా.

గాభరాపడిపోయింది బేగం నస్రుత్. "డాక్టరుగారూ! డాక్టరుగారూ! ఆయన మాటలు పట్టించుకోకండి. ఆయనకు ఉద్రేకం జాస్తి. మీరెంత జాలి గుండెగలవారో మా అమ్మాయి చెప్పింది. నేనూ గ్రహించాను" ముందుకు జరిగి జరీనా చేతులు పట్టుకుని. "డాక్టర్ గారూ! నా మాట మన్నించి, ఇద్దరికీ వెంటనే పెళ్ళి జరిపించండి. ఇవి చేతులు కావు. కాళ్ళు" అంటూ వేడుకుంది.

కొద్ది క్షణాలు మౌనంగా కూచుని జరీనా అన్నది. "పెళ్ళి నిర్ణయించేముందు నా గురించి కూడా తెలుసుకోవాలని మీకు లేదా?"

"మీ గురించే ముంది? మీరు డాక్టర్లు, మీ అబ్బాయి ఇంజనీరు కాబోతున్నాడు అంతే చాలు."

"అది మీకూ, మీ అమ్మాయికి చాలేమో. కాని మీవారికి చాలకపోవచ్చు. వినండి." నస్రుతుల్లావేపు చూడకుండానే కొనసాగించింది. "మా నాన్నగారిపేరు కమాలుద్దీన్. ఇక్కడే ఒక నవాబుగారి దివాణంలో మున్షీ (గుమాస్తా)గా పనిచేసేవాడు. నేనూ, మా అమ్మ,నాన్నా దివాణం అవుటుహౌసులోనే వుండేవాళ్ళం-అక్కడే నాకు ఒక దుర్మార్గుడు, అంటే మరెవ్వరో కాదు, నవాబుగారి చిన్నకొడుకుతో పరిచయమైంది. వాడి మాయమాటల వలలో చిక్కుకుని నా సర్వస్వం కోలుపోయాను. పర్యవసానంగా గర్భవతి నయ్యాను. అది తెలిసి కూడా నన్ను పెళ్ళి చేసుకోడానికి నిరాకరించాడు ఆ కఠినాత్ముడు. గర్భస్రావం చేయించుకోమన్నాడు. అది మన మత సమ్మతం కాదు. పెళ్ళి కాకుండా పిల్లని కనటంకూడా పాపమే మా నాన్నకు ఎటూ పాలుపోలేదు. నవాబుగారికి చెప్పి కూడా లాభముండదని తెలుసు. తన మిత్రుడైన మస్జిద్ ముల్లాను సంప్రతించి, ఆ రాక్షసుణ్ణి బ్రతిమాలి, బ్రతిమాలి, ఆఖరికి చాటుగా "నికాహ్"(పెళ్ళి) చేసుకుని వెంటనే "తలాక్" (విడాకులు) యిచ్చేసేట్టు ఒప్పించాడు. అలానే జరిగింది. ఇక అక్కడ వుండలేక వరంగల్ మా పెదనాన్నగారింటికెళ్ళి అక్కడే స్థిరపడిపోయాం. అక్కడే బాబును కన్నాను. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. పట్టుదలగా చదివి డాక్టర్ నయాను. బాబును పెంచి పెద్దచేసి శ్రద్ధగా చదివించాను. ఇక్కడ ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీలో సీటువస్తే, బదిలీ చేయించుకుని మకాం మార్చాను...."

ఇంతలో "యా అల్లా! యా అల్లా!"

అంటూ రొప్పుతూ గుండెని అదిమిపట్టి. సోఫాలో జేరగిలపడిపోయాడు నస్రుతుల్లా

బేగం నస్రుత్ కంగారుగా లేచి. "ఏమైందండీ! ఏమైంది అండీ!" అంటూ భర్తను పట్టుకుంది

నఫీసా నౌకర్లు పరుగెత్తుకొచ్చారు.

ఈ హఠాత్పరిణామానికి గాబరాపడిపోయింది జరీనా. ముందుకువెళ్ళి ఆయన్ని ముట్టుకోటానికి చేతులు వెనుదీశాయి. అయినా డాక్టరుగా తన కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకుని నాడి పరీక్షించింది. గుండెమీద చెయ్యివేసి చూసింది చెమటలతో వొళ్ళంతా ముద్దై వుంది. వెంటనే లోపలికెళ్ళి. మెడిసిన్ చెస్ట్ తెచ్చి రెండు ఇంజక్షన్లు యిచ్చింది. నస్రుతుల్లా స్పృహలో లేడు.

"చూడండి బేగంసాబ్! మీ ఆయనకు హార్ట్ అటాక్ వచ్చినట్టుంది. వెంటనే హాస్పిటల్లో చేర్పించాలి. లేకుంటే ప్రమాదం" అంటూ వెళ్ళి ఆసుపత్రికి ఫోన్ చేసింది. తన కొలీగ్ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ మూర్తికి ఫోన్ చేసి వెంటనే ఆసుపత్రికి రమ్మని వేడుకుంది.

తల్లీ కూతుళ్ళు ఏడుస్తూ కూచున్నారు.

జరీనా ఆదేశం ప్రకారం డ్రైవరూ, నౌకరూ కలిసి నస్రుతుల్లాను మోసుకెళ్ళి ఆయన కార్లో వెనక సీట్లో పడుకోబెట్టారు. ప్రక్కనే బేగం నస్రుత్ కూచుంది. డ్రైవర్ ప్రక్కన నఫీసా. జరీనా కూచున్నారు కారు కదిలింది.

ఆసుపత్రిలో 'ఇంటెన్సివ్ కేర్' లో అడ్మిట్ చేశారు. డాక్టర్ మూర్తి వచ్చాడు. పరీక్షచేసి ఆయనా రెండు ఇంజక్షన్లు యిచ్చాడు. ఆక్సిజన్ పెట్టారు. ఇ. సి. జి యంత్రం కూడా పెట్టారు.

ఇక చేసేదేమీలేక "మరేం భయంలేదు. కోలుకుంటా"రని తల్లీ, కూతుళ్ళకు ధైర్యం చెప్పి డాక్టర్ మూర్తితోసహా బయటి కొచ్చింది జరీనా. పరిస్థితి ఎలావుందని డాక్టర్ మూర్తిని అడిగితే రాత్రి గడిస్తే గాని చెప్పలేమని అన్నాడు. డ్యూటీ డాక్టర్‌కి కొన్ని ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చి. ఇద్దరూ యిళ్ళకి వెళ్ళిపోయారు.

ఆ రాత్రికూడా నిద్రలేకండా పోయింది జరీనాకు. తాను తలచింది ఒకటి. జరిగింది మరొకటి విషయం తెలిశాక నస్రుతుల్లా పడే మనోవ్యథను చూసి. తనకక్షను తీర్చుకుని ఆ అమ్మాయికికూడా అసలు విషయం చెప్పి. అబార్షన్‌కు వొప్పించి. మరెవ్వరికీ తెలీకుండా చేసేసి చేతులు కడిగేసుకుందామనుకుంది. కాని.... కాని కథ అనూహ్యమైన మలుపు తిరిగింది. ఆయన బ్రతుకి వుంటారో. లేదో కూడా అనుమానంగా వుంది. ఎప్పుడు ఫోనొస్తుందో. ఏ దుర్వార్త చెవిని పడుతుందోనని ఆందోళనగా గడిపింది. ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదు.

మెలుకువొచ్చే సరికి పొద్దుపోయింది. ఏడు దాటింది గబగబా వెళ్ళి డ్యూటీ డాక్టర్‌కు ఫోను చేసింది. ఆయన చెప్పింది చెవిని పడగానే నిశ్చేష్టురాలైంది.

నస్రుతుల్లాకు తెల్లవారుఝామునే తెలివొచ్చిందట. రాగానే అటూ, యిటూ చూసి కూతుర్ని దగ్గరికి రమ్మని అందరీ్ని అక్కడ్నించి వెళ్ళిపొమ్మన్నాట్ట. ఏం జరిగిందో ఏమో. కొద్ది సేపట్లోనే ఆ అమ్మాయి మొహానికి చేతులు అడ్డం పెట్టుకుని ఏడుస్తూ ఇంటికి పరుగు తీసింది. మరికొద్ది క్షణాలకే "నఫీసా బేటీ! నఫీసా బేటీ!" అంటూ ఆయన ప్రాణాలు వదిలాడు. డాక్టర్ మూర్తికి కబురంది ఆయన వొచ్చేలోపునే అంతా అయిపోయింది. ఇంకా ఆ షాక్‌నుంచి తేరుకోకముందే. నఫీసా విషంతాగి పడిపోయిందని ఆసుపత్రికే మోసుకొచ్చారు. మూర్తే పరీక్షించాడు. కాని అప్పటికే ఆమె చనిపోయి చాలాసేపయింది. "తన చావుకు తానే బాధ్యురాలిననీ. మరెవ్వరూ కారనీ" రాసిపెట్టి పోయిందట.

జరీనా చేతిలోంచి రిసీవర్ జారి పడిపోయింది. అక్కడే చతికిలపడ్డది.

ఎందుకు?.... ఎందుకిలా జరిగింది?. ఈ అఘాయిత్యానికి కారకులు ఎవరు?.. తన కొడుకా?.... తానా?.... ఎవరు .... ఎవరు బాధ్యులు?

